# కాంగ్రెస్‌లో ముసలం

- శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో.. కాంగ్రెస్ మేయర్లు, చైర్మన్లపై అవిశ్వాసం
- తిరుగుబావుటకు సిద్ధమైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు
- మిగిలిన ఏడాదిలో వచ్చే పనులూ ఏమీ లేవనే భావన
- రాజకీయానికి మించి ఆర్థిక కోణంలోనే ఆరాటం
- స్థానిక సంస్థల సూపరింటెండెంట్‌కు.. అవిశ్వాస తీర్మానం అందజేసిన ఆదిబట్ల కౌన్సిలర్లు



ఆవిశ్వాసం పెట్టాలని స్థానిక సంస్థల సూపరింటెండెంట్‌కు తీర్మానం అందచేస్తున్న ఆదిబట్ల మున్సిపల్ కౌన్సిలర్లు

**అధికార కాంగ్రెస్ పార్టీకి ఆదిలోనే ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. శివారు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌లో చేరిన మేయర్లు, చైర్మన్లపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తిరగబడుతున్నారు. వారి ఏకపక్ష దోరణి, పార్టీ పిరాయింపును సహించడం లేదు. నిబంధనల ప్రకారం వారిపై అవిశ్వాసానికి ఇన్నాళ్లూ అవకాశం లేకపోవడంతో వారికి చేతులు కట్టేసినట్లుగా మారాయి. దీంతో లోలోనే రగిలిపోయారు. కానీ ఈ నెల చివరికి నాలుగేళ్లు పూర్తికావడంతో తిరుగుబావుటాకు సిద్ధమవుతున్నారు. సొంత పార్టీ మేయర్, చైర్మన్లపై కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు, కార్పొరేటర్‌లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్‌లతో చేతులు కలిపి ఎలాగైనా గద్దె దింపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి ఇప్పటికే రంగం సిద్ధమైంది.**

*- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 5 (నమస్తే తెలంగాణ)/ఆదిబట్ల*


నగర శివారుల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల సీజన్ వచ్చింది. వాస్తవానికి చాలాచోట్ల ఏడాది, రెండేండ్లుగా మేయర్లు, చైర్మన్లపై కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. కానీ నిబంధనల ప్రకారం వారిపై అవిశ్వాసానికి అవకాశం లేకపోవడంతో ఇన్నాళ్లూ వారికి చేతులు కట్టేసినట్లుగా ఉంది. కానీ ఈ నెలాఖరుతో దాదాపు అన్ని స్థానిక సంస్థల కాలం నాలుగు సంవత్సరాలు దాటనుండటంతో తిరుగుబావుటాకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి ఇప్పటికే రంగం సిద్ధమైంది. తాజాగా ఆదిబట్ల మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం శుక్రవారం స్థానిక సంస్థల సూపరింటెండెంట్ వద్దకు చేరింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలోనే ఈ మేరకు తీర్మానాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

## నోట్ల కట్టల కోసమేనా..?

ముఖ్యంగా వీటిలో రాజకీయ పరిణామాలు, పంతాలు ఒకవంతైతే.. వివిధ పార్టీల్లోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు అవిశ్వాసం అనేది కామధేనువుగా మారింది. చాలాకాలంగా మేయర్, చైర్మన్లు తోటి సభ్యులను పట్టించుకోవడం లేదు. పనుల విషయంలోనూ వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. దీంతో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఇదే అవకాశంగా భావించి.. అవిశ్వాసానికి గళం కలుపుతున్నారు. ఎలాగూ అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఖజానా పరిస్థితి అంతంత మాత్రంగానే తయారైంది. కేసీఆర్ ప్రభుత్వంలో సీఎం స్పెషల్ ఫండ్, ఇతరత్రా మార్గాల నుంచి నిధులు రావడం వల్ల తమ పరిధుల్లో అభివృద్ధి పనులైనా జరుగుతాయనే ఆశాభావం వారిలో ఉండేది. కానీ ఇప్పుడు కొత్త సర్కారు చివరి ఏడాదిలో ఆర్థికంగా పెద్దగా ఆదుకునే పరిస్థితి ఉండదని, దీనికి తోడు రాజకీయాల కారణంగా పనులేవీ ముందుకుపడవని కార్పొరేటర్ ఒకరు అన్నారు. అందుకే అవిశ్వాసం సందర్భంగానైనా తమకు ఆర్థికంగా కొంత ఊరట కలుగుతుందని మనసులోని మాట వెల్లడించారు. తానే కాదు.. చాలామంది ప్రజాప్రతినిధులు ఇదేరీతిన ఆలోచిస్తున్నారని, ఉన్న ఒక్క ఏడాదిలో కొంత ఆర్థికంగా రావాలంటే అవిశ్వాసం తప్ప వేరే మార్గమేమీ కనిపించడంలేదన్నారు.

## ఆదిబట్లలో అధికార పార్టీలో పుట్టిన ముసలం..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల మున్సిపాలిటీలో అధికార పార్టీలోనే ముసలం మొదలైంది. ఇక్కడ 15 వార్డులు ఉండగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ చెరో ఏడు స్థానాల్లో గెలువగా, బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకుంది. కాంగ్రెస్‌కు చెందిన కొత్త ఆర్తీక అప్పట్లో బీఆర్ఎస్‌లోకి వచ్చి మేయర్ పీఠం ఎక్కారు. కొన్నిరోజులుకే తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. దీంతో అవిశ్వాసం కోసం పలువురు కౌన్సిలర్లు ప్రయత్నాలు చేసినా.. నిబంధనలు అడ్డువచ్చాయి. కాగా ప్రస్తుతం ఆ సమయం రావడంతో కౌన్సిలర్లకు అవకాశం వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు, బీఆర్ఎస్‌కు చెందిన మరో ఆరుగురితో పాటు బీజేపీకి చెందిన కౌన్సిలర్ కూడా అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ మినహా మిగిలిన వారంతా శుక్రవారం స్థానిక సంస్థల సూపరింటెండెంట్ రమేశ్‌నాయక్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందించారు.



To
The Collector & District Magistrate,
Ranga Reddy District,
Telangana State.

Sir/Madam,

We the undersigned members of Adibatla Municipal Council, Ranga Reddy District, hereby give notice of our intention as required by section 37 of Telangana Municipalities Act, 2019, to make a motion expressing want of confidence on Smt. Kotha Arthika & [illegible] Vice Chairperson of the said Municipal Council at a meeting to be specially convened for the purpose The sanction strength of Municipal council is 15 Members and the number of Ex-officio Members is4...

A copy of the motion proposed to be made is enclosed signed at Friday on the day of [illegible] Jan 2024

| Sl.No | Name of the Member with Ward Number | Signature of the Member |
|---|---|---|
| 1 | Smt. Nallavolu Lavanya 1st | |
| 2 | Smt. KUrella Mounika 2nd | |
| 3 | Smt. Kanthi Sandya 3rd | |
| 4 | Shri. Koppu Krishna raja 4th | |
| 5 | Shri. Vasamula Srinivas 5th | |
| 6 | Shri. Kola Nagesh 6th | |
| 7 | Shri. Neella Haridas 7th | N. HARI DAS |
| 8 | Shri. Gopagalla Mahender 8th | |
| 9 | Shri. Marri Niranjan Reddy 9th | |
| 10 | Smt. Marri Archana 11th | |
| 11 | Smt. Narani Mounika 12th | |
| 12 | Shri. Potti Ramulu 13th | |
| 13 | Shri. Kamandla Yadagiri 15th | |

సభ్యులు సంతకాలు పెట్టి తీర్మానం చేసిన కాపి...

## చైర్మన్, వైస్ చైర్మన్ల ఏక పక్షనిర్ణయాలతోనే...

ఆదిబట్ల మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై పోటీ చేసి గెలుపొందిన కొత్త ఆర్తీక నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ పార్టీలో చేరి చైర్మన్ అయ్యారు. చైర్మన్ ఎన్నిక సమయంలో అప్పటి కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అప్పటి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ ఘర్షణ చోటుచేసుకున్నది. చైర్మన్ రేసులో ఉన్న మరో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆ అవకాశం చేజారిన తర్వాత కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి నిత్యం వ్యతిరేకంగానే వ్యవహరించారు. కౌన్సిల్ సమావేశాల్లోనూ వాగ్వాదానికి దిగేవారు. కాగా ప్రస్తుతం నిబంధనల ప్రకారమే అవకాశం రావడంతో అవిశ్వాస అస్త్రాన్ని ప్రయోగంగా ఉపయోగిస్తున్నారు.

# అపోలోలో 2500కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు




సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ) : వినికిడి సమస్య ఉన్న రోగుల పాలిట వరంగా మారిన కాక్లియర్ ఇంప్లాంట్ విజయవంతమైన ఫలితాలు ఇస్తున్నాయని, ఈ క్రమంలో వినికిడి లోపం ఉన్న ఎంతో మంది బాధితులు తమ సమస్యను అంగవైకల్యంగా భావించి మానసికంగా బాధపడకుండా సాధారణ వ్యక్తుల్లానే ప్రభుత్వ రంగంలోని ఉన్నత స్థాయి ఉద్యోగాలను సైతం అధిరోహిస్తున్నట్లు అపోలో హాస్పిటల్ ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ ఈ.సీ.వినయ్‌కుమార్ తెలిపారు. ఇప్పటి వరకు దవాఖానలో 2500కాక్లియర్ ఇంప్లాంట్స్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని, అందులో 9నెలల శిశువు నుంచి 87ఏళ్ల వృద్ధుల వరకు ఉన్నట్లు తెలిపారు. అపోలో కాక్లియర్ ఇంప్లాంట్ క్లినిక్ ఒకే రోజు 18 సర్జరీలు చేసి, లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సొంతం చేసుకున్నదని గుర్తుచేశారు. వినికిడి లోపాన్ని అంగవైకల్యంగా భావించి మానసిక వత్తిడికి గురికానవసరం లేదన్నారు. డా. శ్రీకాంత్ మాట్లాడుతూ సాధారణ వ్యక్తులు 40నుంచి 60డెసిబుల్ శబ్దాన్ని వినగలుగుతారని, వినికిడి లోపం ఉన్న వారు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేయించుకున్న తరువాత 25డెసిబుల్‌లోపు శబ్దాన్ని వినగలుగుతారన్నారు. ఒక వ్యక్తి శబ్దాన్ని వినేందుకు 25డెసిబుల్‌ను ప్రామాణికంగా తీసుకోవచ్చని, కాక్లియర్ ఇంప్లాంట్ వల్ల ఇది సాధ్యమవుతుందన్నారు. అపోలో దవాఖానలో కాక్లియర్ ఇంప్లాంట్ చేయించుకున్న వారిలో కొంత మంది ప్రభుత్వ రంగంలోని ఉన్నత స్థాయి ఉద్యోగాలను అధిరోహించారని, వారితో పాటు కొంత మంది క్రీడల్లో కూడా రానిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే డెఫ్ నేషనల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఎస్.సాయిచందన్ అనే క్రీడాకారుడు జాతీయ స్థాయిలో 5వ స్థానం, ప్రపంచ స్థాయిలో 7వ స్థానాన్ని సాధించారన్నారు. అంతేకాకుండా 9వ తరగతి చదువుతున్న యశ్వంత్‌రెడ్డి ప్రముఖ యూట్యూబర్‌గా, అనూష అపోలో దవాఖానలోనే ఆడియాలజిస్ట్‌గా సాధారణ వ్యక్తుల్లానే విజయాలను అధిరోహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యనిపుణులు, కాక్లియర్ ఇంప్లాంట్స్ సర్జరీ చేయించుకుని వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు రూ.10వేల కోట్లు కేటాయించాలి

*తెలంగాణ ఉద్యమకారుల ఫోరం*



అభివాదం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు

రవీంద్రభారతి, జనవరి 5 : తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని, ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు కార్డులు ఇచ్చి గౌరవించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనవాస్ కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనవాస్, జనరల్ సెక్రటరీ పి.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి కమిటీ వేస్తామని తెలిపిందని వెంటనే కమిటీ వేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, పింఛన్, ఉచిత బస్ పాస్, రూ.20లక్షల జీవిత బీమా, నిరుద్యోగులకు రూ.50 లక్షల వడ్డీలేని రుణాలు, ఉద్యోగాల్లో 20శాతం కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని అన్నారు.

# విద్యారంగంలో గురుకుల్ లైబ్రరీ విప్లవాత్మక మార్పు



సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ) : పతంజలి యోగ్‌పీఠ్ 29వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గురుకుల్ లైబ్రరీని భారత రక్షణ శాఖ మంత్రి చంబాపూర్‌లో ప్రారంభించనున్నట్లు స్వామి రాందేవ్‌బాబా తెలిపారు. యోగపీఠ్ మహర్శి దయానంద సరస్వతి 200వ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హరిద్వార్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. పతంజలి గురుకుల విధానాన్ని స్వామి దర్శనంద్ 118 ఏండ్ల క్రితమే ప్రారంభించారని గుర్తుచేశారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సీఎంలతోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

# నెవర్ ఎండ్ పుస్తకావిష్కరణ



చిక్కడపల్లి, జనవరి 5: తెలంగాణలో గత 40 ఏండ్లుగా యువజనోద్యమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన వీరుల చరిత్రను రాష్ట్ర వ్యాప్తంగా 822 కిలో మీటర్లు మోటార్ సైకిల్ యాత్ర చేసి ఎం.విప్లవకుమార్, ఎ.విజయ్ కుమార్‌లు వెలికితీసి రాసిన పుస్తకం 'నెవర్ ఎండ్''. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం సుందయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నర్సింరెడ్డి, ప్రజాకవి జయరాజ్ ముఖ్య అతిథిగా హాజరైన పుస్తకాన్ని ఆవిష్కరించారు. భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవి యాకూబ్, చింతల యాదగిరి, పసునూరి రవీందర్, గోపాల్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ): రైల్వే ఏడీజీ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఎస్పీఎస్సార్పీ కార్యాలయంలో శుక్రవారం 'ఆపరేషన్ స్మైల్' అనే అవేర్నెస్ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆర్పీఎఫ్, కార్మిక శాఖ అధికారులు, సీడబ్ల్యూసీ చైర్మన్ అండ్ సభ్యులు, చైల్డ్‌లైన్ 1098 సిబ్బంది, బీబీఏ సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్, ప్రజ్వల సిబ్బంది, ఇంకా జీఆర్పీ అధికారులు, ఎస్సార్పీ ఎస్పీ సలీమా పాల్గొన్నారు. రైళ్లల్లో, ప్లాట్‌ఫామ్‌లలో చైల్డ్ లేబర్‌ను రక్షించిన తీరు, వేశ్య వృత్తి నిర్మూలన, మానవ అక్రమ రవాణాలపై చర్చ జరిగింది.